

# అగ్రహారం కథలు
## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

## నాన్న పేరున......

మన అగ్రహారానికి ఒకటో రెండో మైళ్ళ దూరాన ఉంది ఆ అగ్రహారం.. తీరు తెన్నూ, అన్నీ మన అగ్రహారంలాగే. కానైతే మెయిన్ రోడ్డుకి కాస్త లోపలకి ఉంటుంది. పెద్ద పట్నాలలో అయితే వీటినే పేటలందురు మరి. కొందరు మన అగ్రహారపు కోడళ్ళకి పుట్టిన ఊరయితే, మరికొందరు అగ్రహారపు ఆడపిల్లలకి అత్తగారి ఊరు.

ఆ ఊరిలో ఆ రోజు మంచి హడావుడిగా ఉంది. ఊరంతా రంగు రంగుల తోరణాలు కట్టారు, మావిడాకులతోటీ, జండాలతోటీ. కొత్తగా, కమ్మగా వాసన వేస్తున్న కొబ్బరాకుల పందిరి వేసారు. పచ్చటి పేన్నీళ్ళు చల్లి ఊరి మొదటినుంచీ ఆడపిల్లలు రంగు రంగుల ముగ్గులు అందంగా తీర్చి దిద్దారు. చుట్టుపక్కల నాలుగు ఊళ్ళకీ కబుర్లు వెళ్ళాయి. మర్నాడే స్కూల్ ప్రారంభం, విస్సన్న గారి అబ్బాయిలు, అమ్మాయిలు, కోడళ్ళూ, మంగళాంబ గారు వస్తున్నారు అని. ఊరి పెద్దలందరూ దాదాపు ముప్పయ్ ఏళ్ళక్రితం ఊరు వదిలి వెళ్ళిన వారికోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

రాజమండ్రిలో రైలు దిగి రెండు కార్లలో వచ్చారు విస్సన్నగారి పిల్లలు, భార్య మంగళాంబ గారు. ఇన్నేళ్ళ తరవాత వారిని చూసినందుకు ఎంతో ఆనందించారు ఊరి పెద్దలు. దాదాపు తొంభై ఏళ్ళ వయసున్న మంగళాంబగారిని చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి కరణంగారింట్లో కూర్చోబెట్టారు. కొడుకులనీ, కొడళ్ళనీ, కూతుళ్ళనీ పేరు పేరునా అందరూ పలకరించారు. మనవల, మునిమనవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత రోజులు తలుచుకుని కళ్ళూ, మనసులూ తడి చేసుకున్నారు. ' ఊరువదిలి వెళ్ళిన తరవాత ఎప్పుడైనా చుట్టపు చూపుగా రావడమే తప్ప ఇన్నాళ్ళకి ఒక రోజు ఉంటున్నారని చాల ఆనందించారు'. విస్సన్న గారి పేరుమీద కట్టిన గవర్నమెంటు అప్పర్ ప్రైమరీ పాఠశాల ప్రారంభోత్సవం మర్నాడు. కరణంగారింట్లో అందరికీ బసలు ఏర్పాటు అయ్యాయి.

స్నానానికని కరణంగారి నూతిలో చేద వేసిన విస్సన్నగారి అబ్బాయి మనసులో ముసిరిన జ్ఞాపకాల అలలు, చేద తాకిడికి నూతిలో కదిలిన అలల్లాగే. అక్కడనించి చూస్తే స్కూల్ చక్కగా కనిపిస్తోంది. దాన్ని చూస్తుంటే 'నాన్నని చూస్తున్నట్టే' ఉంది అనుకున్నారాయన. తన వూరి నీళ్ళతో తల తడి చేసుకుంటూ. నాన్న తలపుకు రాగానే అతని మనసులోనూ తడి. ప్రయత్నం లేకుండానే కాలాన్ని వెనక్కు తిప్పిన అనుభూతుల సడి.

-----------

ఆ ఊరిలోకెల్లా ఎక్కువ మండువాలు, శుచీ శుభ్రతలూ ఉన్న ఇల్లెవరిదంటే అది విశ్వనాధంగారిదే. విశ్వనాధం గారిని విస్సన్న గారంటారు. సుతిమెత్తనైన మనసూ, ఎవరినీ నొప్పించని మాట ఆయన సొంతం. అంతేకాదు, మితమైన కోరికలూ, పద్ధతైన నడవడికతో మనిషి ఎంత సంతోషంగా ఉండవచ్చో, తనకోసమే కాకుండా ఇతరుల కొరకు ఆలోచించడంలో ఎంత ఆనందం ఉంటుందో తెలుసుకోవడానికి ఆయనో పెద్ద ఉదాహరణ.

ఊరిలో పెద్దమనిషి గానే కాదు, కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా, పంచాయతీ బోర్డ్ మెంబర్‌గా కూడా ఆయన ఊరిలో చాలా గౌరవనీయులు. మంగళాంబ గారాయన ఇల్లాలు. అయిదుగురు కొడుకులూ, నలుగురు కూతుళ్ళూ వారికి. పసిమి వర్ణంలో, కొద్దిగా గట్టిగా మాట్లాడినా సరే, మొహమూ, చెవులు ఎర్రబడేంత సున్నితంగా ఉండేవారు విశ్వనాధంగారు. చామన చాయలో, పొడుగ్గా, సన్నగా, కళకళలాడే ముఖంతో, ఏడురాళ్ళ రవ్వల ముక్కుపుడకతో దీపంలా ఉండేవారు మంగళాంబ గారు. ఆవిడకి వినికిడి తక్కువే అయినా విస్సన్న గారు పెదాల కదలికతోనే ఏదైనా చెప్పగలరు, ఆవిడ కూడ నోరు తెరిచి చెప్పక్కర్లేకుండానే అన్ని తెలుసుకోగలరు. అదో, మాటలకి అందని, పెద్దగా అక్కరలేని అందమైన అనుబంధం..

పొద్దుపొడవడంతోనే నిద్ర లేచేవారు ఆయన. మొహం కడగడంతోనే ఇత్తడి చెంబు తీసుకుని పెరట్లోకి వెళ్ళి పాలు పితికి తీసుకొచ్చి అప్పటికే లేచి కాఫీ డికాషన్ వేసి తయారుగా ఉన్న మంగళాంబ గారికిచ్చేవారు. ఆవిడ క్షణాల్లో బ్రహ్మాండంగా ఫిల్టర్ కాఫీ తయారు చేసి ఇచ్చేవారు. తన కుటుంబానికవసరమైన పాలు ఉంచుకుని మిగతాది కావలసినవారికి ఇచ్చేవారు. పాలైనా, పండైనా, ఫలమైనా అంతే. ఇతరులకోసమే అన్నీ ఇచ్చే చెట్టూ, చేమా, గొడ్డూ గోదలకంటే జ్ఞానమున్న మనం మెరుగ్గా ఆలోచించాలి కదా! తమవైనా సరే అవి తమకోసం ఏమీ ఉంచుకోవు మరి మనది కానిదానికి మనమెందుకు అతిగా ఆశ పడాలి? అని ఆయన అభిప్రాయం. చిన్నగ్లాసుడు కాఫీ తాగి స్నానపానాదులు, కుప్తంగా పూజ కానిచ్చుకుని, నిద్రపోతున్న పిల్లలని పేరు పేరునా లేపేవారు..

పిల్లలంటే అలవికాని ప్రేమ విస్సన్నగారికి. వెంట వెంటే ఉండి కబుర్లు చెప్పేవారు, వార్తలూ, విశేషాలు చెప్పడం, కథలూ కబుర్లూ చెప్పి నవ్వించడం ఆయన కెంతో ఇష్టం. వాళ్ళందరినీ పేరుపేరునా గారం చేసేవారు. ఆయనకి ఉన్న ఒకే ఒక బలహీనత ప్రధమకోపం. విసుగు కొద్దిగా ఎక్కువ. తను అనుకున్న పని అనుకున్నట్టు అవకపోతే గొప్ప చిరాకు పడేవారు. అయితే ఆ కోపం పాలపొంగు లాంటిది, వచ్చినంతసేపు ఉండదు. ఆ కారణంగా పిల్లలనెప్పుడైనా కోప్పడినా, తిరిగి లక్ష విధాల బుజ్జగించి, లాలించి వాళ్ళు అన్నం తినేవరకూ ఆయనకి తోచేది కాదు.

'ముందు అరవడం ఎందుకు? ఇప్పుడు బతిమాలడం ఎందుకు? ' అని మంగళాంబ గారు వెక్కిరిస్తే చిన్నగా నవ్వేసేవారు. 'నీకు తెలియదులే' అన్నట్టు.

పిల్లలు స్కూళ్ళకీ కాలేజీలకి వెళ్ళాకా, మల్లెపూవు లాంటి తెల్లటి పంచె కట్టుకుని. నున్నగా తుడిచి అద్దంలా ఉన్న వీధి అరుగుమీద చిన్న చాప వేసుకుని పేపర్ చదువుకునేవారు. పక్కన బుష్ రేడియో పెట్టుకుని. అప్పుడే వచ్చేవారు ఊరిలో వాళ్ళు. ఏదైనా సలహాకో, మరేదైనా పనికో. ఎవరికేం కావాలన్నా లేదనకుండా చేసేవారు. ఒకవేళ లేదనవలసి వస్తే ' నోటితో కాకుండా చేత్తో లేదనేలా పని చేసేవారు. అంటే ఎంత వరకు వీలైతే అంత అన్నమాట..

పొద్దున్నా రాత్రి మితంగా భోజనం, మధ్యలో ఓ పండో ఫలహారమో అంతే . హితవైన పదార్ధం మితంగా తినాలి అప్పుడే మనకి అది మంచిది' అనేవారు.

ఆయన ఆలోచనలెప్పుడూ ఊరికేదైనా చెయ్యగలమా అన్న దానిమీదే ఉండేవి. 'సొంత లాభం కొంత మానుకు'... అన్నది ఆయన అభిప్రాయంగా ఉండేది. అందుకే ఊరిలో అందరికీ రేషన్‌లో చక్కెర అవీ సమయానికి అందేట్టు చూసేవారు. ఊరిలో వేద పాఠశాల నిర్వహణకి అన్నివిధాలా సహకరించడమేకాదు, ఊరిలో పిల్లలందరికీ టీకాలు, మందులు సరిగ్గే అందేలా చూడటం ఇలా చాలా చేసేవారు ఆయన.

విస్సన్నగారు ఆ రోజుల్లోనే మద్రాస్‌లో ఉండి బి.ఎ చదువుకున్నారు. ఒక్కరే కొడుకవడంవల్ల తండ్రి మాట కాదనలేక ఉద్యోగ ప్రయత్నాలని మధ్యలోనే వదిలి సొంత ఊరికి వచ్చేసారు. అయినా పిల్లలకి మంచి చదువులు చెప్పించాలని ఆయన కోరిక.. టవునుకి కొద్దిగా ఎడంగా ఉన్న ఆ ఊరికి కాలవ మీద వంతెన దాటి వెళ్ళాలి. వంతెనా కూడా చాలా బలహీనంగా ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా ఉండేది. మూడు నాలుగు చోట్ల చిల్లులు పడడంతో దాన్ని దాటడం ప్రాణ సంకటంలా ఉండేది. ఎడ్ల బళ్ళూ, జట్కాలూ కూడా, వంతెన కవతల జనాలని దింపేసి, ఖాళీ బండిని జాగ్రత్తగా వంతెన మీద నడిపించి, జనం కూడ వంతెన కాలినడకన దాటాకా, ఇవతలివైపున మళ్ళీ ఎక్కించుకునేవారు. సరైన రోడ్డు లేని ఊరినించి టవునుకి రాకపోకలు చాలా కష్టం. ఇక వర్షాకాలం వచ్చిందంటే చెప్పక్కర్లేదు. అసలేపల్లంలో ఉన్న ఊర్లు, దారి తెన్నూ లేని రోడ్లు, దానితో దారి అంతా వర్షం నీళ్ళకి మురికి, బంద. అడుగు తీస్తే అడుగు వెయ్యలేనంతల్లా తయారయ్యేది. అలాంటి రోడ్లమీద రోజూ ఊరి పిల్లలు స్కూళ్ళకీ, కాలేజీలకి పక్క ఊర్లకీ, టవునుకీ, వెళ్ళాలంటే చాలా కష్టంగా ఉండేది. అది చూసినప్పుడల్లా ఆయన మనసు కొట్టుకుపోయేది.

ఊరిలో ఉన్నవి రెండే స్కూళ్ళు. ఒకటి వేద పాఠశాల, రెండోది చిన్నబడిగా పిలవబడే ప్రైమరీ స్కూల్. చిన్న బడిని కరణంగారి అరుగుమీదో, వీధి సావడిలోనో నిర్వహించేవారు ఎందుకంటే పక్కా భవనం లేదు దానికి. అక్కడ అయిదో తరగతి దాకా మాత్రమే చదువు. స్కూల్ కంతటికీ ఒకరే ఉపాధ్యాయులు. 'చద్దికుండ మాస్టారు' అనేవారు అందరూ ఆయనని. పొద్దున్నే తరవాణిలో వేసిన చద్దన్నం తినేసి వస్తారు అందుకని. చదువు చాలా శ్రద్దగా చెప్పేవారు. పిల్లలని లాలించో, బెదిరించో మొత్తానికి వాళ్ళందరినీ చదివించేవారు. తెలివైన పిల్లలైతే ఒకేసారి ఇంటూ ఫస్టు ఫారం కట్టిద్దామని తల్లితండ్రులతో చెప్పి ఒప్పించేవారు. దానికి ప్రత్యేక శ్రద్దతో వాళ్ళకి చదువు చెప్పేవారు.

అలాంటి పల్లెటూరిలో పిల్లలు చదువుకి రావడమే గొప్ప. ఆడపిల్లలైతే మరీను. చెమ్మచెక్కలో, చింతపిక్కలో ఆడుకోవడంలో వాళ్ళకున్న ఉత్సాహంలో సగం, బడికి రావడంలో ఉండేది కాదు. అదీ కాక ఏడాదికి సగం రోజులు పండగలూ, పబ్బాలు.
'సాయంత్రం మా ఇంట్లో బొమ్మల కొలువండీ, పేరంటాలకి పిలవాలి అనో, అట్లతద్దండీ 'అనో, ఏదో వంకతో ఆడపిల్లలు బళ్ళు మానేసేవారు.

అదీకాకపోతే, మేము ఇవ్వాళ 'మా తాతగారింటికి వెళుతున్నామండి, మా పిన్ని పెళ్ళి. మళ్ళీ వచ్చే నెల్లోనే రావడం, మా తాతగారి ఊళ్ళో బడికెళ్ళమంది మా అమ్మ మళ్ళీ వచ్చేవరకు' అనేవారు.

మగపిల్లలు కొద్దిగా పరవాలేదు. ఎవరైనా 'ఇవ్వాళ తోటలో దింపండి' అనో, 'ఊడుపు చేలో కోతలండి' అనో చెప్పి ఎగ్గొట్టడానికి చూస్తే, వాళ్ళ పిలకలు పట్టి మరీ కూర్చోపెట్టేవారు. 'పొట్టకోస్తే అక్షరముక్క లేకపోతే ఎలా బతుకుతార్రా?' అంటూ.

స్వత హాగా చదువు మీద ఉన్న ఆసక్తి చేత విస్సన్నగారు తరచూ మాస్టారితో పాటు ఇంటింటికీ వెళ్ళి పిల్లలు చదువుకోవడం ఎంత అవసరమో, పెద్దవాళ్ళు సహకరిస్తే అది ఎంత సులభసాధ్యమో వివరంగా, ఓపికగా చెప్పేవారు. అంతే కాదు, పేదపిల్లలకి తమ ఇంట్లో భోజనాలు పెట్టి, పుస్తకాలు కొనిచ్చి ఇలా తోచినంత సహాయం చేసేవారు. రోజూ తమ పిల్లలతో పాటు ఇంగ్లీష్ వ్యాకరణం అవీ

చెప్పేవారు. వారింట్లో రోజూ కనీసం ఇద్దరైనా వారాలబ్బాయిలు భోజనానికి తప్పకుండా ఉండేవారు. మంగళాంబ గారు కూడ క్రమం తప్పకుండా వారికి కూడా వాళ్ళ పిల్లలతో సమానంగా భోజనం పెట్టేవారు. అలా వారింట్లో పెరిగిన పిల్లలు పెద్ద ఉపాధ్యాయులే కాదు, అధికారులే కాదు, సబ్ కలక్టర్లు అయినా కూడా వారినెప్పుడూ మరిచిపోలేదు దొడ్డమ్మ గారూ, పెద్దనాన్నగారూ అంటూ.

నాలుగు లాంతర్లు పంచుతున్న వెలుగులో రాత్రిపూట విస్సన్నగారి పొడవైన అరుగులమీద పిల్లలు చదువుకునేవారు.

ఏమర్రా, రేపు 'ఎస్ స్కూలా? నో స్కూలా?' అని వేళాకోళం ఆడేవారు ఆయన. అప్పటికింకా కరంట్ కూడా రాని ఆ ఊరిలో విస్సన్నగారు వెలిగించిన ఆ విద్యాదీపాలే విద్యుద్దీపాలు మరి.

విస్సన్నగారి పెద్ద అబ్బాయిలిద్దరూ కాలేజీ చదువులకొచ్చారు. తక్కిన అబ్బాయిలు హైస్కూలికి. పెద్దవాళ్ళిద్దరికీ ఒక సైకిల్ కొన్నారు ఆయన. పొద్దున్నే అమ్మ పెట్టిన వేడన్నం తినేసి సైకిల్ ఎక్కి వెళ్తే పాపం సాయంత్రానికే వాళ్ళు తిరిగి వచ్చేది. ఇద్దరూ వంతుల వారిగా సైకిల్ తొక్కేవారు. వర్షాకాలం వస్తే చెప్పులూ, పాంట్లూ సంచీలో పెట్టుకుని నిక్కర్లు వేసుకుని నడిచి వంతెన దాటాకా కాలవలో కాళ్ళు కడుక్కుని అప్పుడు జోళ్ళూ, పాంట్లూ వేసుకుని వెళ్ళేవారు హైస్కూళ్ళకి, కాలేజీలకి.

పిల్లలంటే విపరీతమైన ప్రేమ గల విస్సన్నగారికి పాపం ఇది చాలా కష్టంగా ఉండేది. దానికి తోడు ఊరిలో ఉన్న నామ మాత్రపు స్కూల్ కూడ వర్షం పడితే కరణంగారి సావడి కారుతోందనో, లేకపోతే అరుగుమీద జల్లు బాగా పడుతోందనో మూసెయ్యవలసి వచ్చేది. నాలుగు రోజులు పిల్లలు రాకా, రోజూ పాపం వర్షమైనా సరే తడుసుకుంటూనే వచ్చిన గురువుగారు మర్నాడు జ్వరం వచ్చి రాకా, 'వానాకాలం చదువు' అనే దానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచేది స్కూల్. అప్పుడే విశ్వనాథం గారికి అనిపించేది 'స్కూల్‌కి ఒక పక్కా భవనం ఉంటే ఎంత బావుంటుందో 'అని.

పంచాయితీ బోర్డ్ ఆఫీసే కొన్నాళ్ళు ఇళ్ళల్లో నడిపారు. తరవాత మెల్లిగా ఒక గదిగల ఆఫీసూ, దానికో రేడియో ఏర్పాటు చేసేసరికే ఆయనకి నీరసం వచ్చింది, రోజు విడిచి రోజు సైకిల్ మీద అమలాపురం, అప్పుడప్పుడూ జిల్లా ముఖ్య పట్టణం కాకినాడ వెళ్ళి అవి సాధించుకుని వచ్చేసరికి. అయినా ఆయనకి స్కూల్ మీద ఉన్న ధ్యాస ఇసుమంతైనా తగ్గలేదు.

శ్రావణ మాసం కావడాన వర్షాలు జోరున కురుస్తున్నాయి ఆ ఏడు.. వర్షం ధారగా కురవడం, రోజంతా మబ్బులు మూసి, మెరుపులు ఉరుముల తో భయపెట్ట పిల్లలు కాగితం పడవలేసుకుని చూరు నీళ్ళల్లో తడుసుకుంటూ ఆడుకోవడమే. నాలుగు రోజుల తరవాత తెరిపిచ్చింది. అనుకోకుండా వచ్చిన నాలుగు రోజుల సెలవులు ఆనందంగా అనుభవించిన పిల్లలు మళ్ళీ దిగులు మొహాలు వేసుకుని టౌన్ స్కూలికి బయలుదేరారు. సూర్రావు బండిలో సుబ్బయ్య గారి చంటి, ఎర్రబ్బాయి గారి సత్తి, వర్ధనమ్మగారి మనవరాలు సుందరి, ఇలా ఓ అరడజను పిల్లలు. పొద్దున్నే వాళ్ళని స్కూల్లో దింపేసి వచ్చేసాడు సూర్రావు, సాయంత్రం వెళ్ళి తీసుకురావాలి మళ్ళీ.

పొద్దున్నే తుప్పరగా మొదలయిన వాన మధ్యాహ్నం భోజనాలవేళకి పెద్దదయి కుంభ వృష్టిగా మారింది. ఏనుగు తొండాలతో కురుస్తున్నట్టుగా ఉంది. ఊరు పల్లంలో ఉండేసరికి నీళ్ళు రావడం మొదలయ్యింది. కాలవ పొంగి వంతెన మీద జోరున దబాదబా బాదడంతో వంతెన కున్న చిల్లులు పెద్దవయ్యాయి.. ఎక్కడ అడుగు వేస్తే ఏమవుతుందోన్న పరిస్థితి.

సాయంత్రం మూడు గంటలకే ముసురుకున్న మబ్బులతో రాత్రి ఎనిమిది అయినట్టుగా, ఊరంతా నల్లటి కంబళి కప్పుకున్నట్టుగా ఉంది. 'పిల్లలు వెనక్కి రావాలి, బండి వెళ్ళడానికి లేదు, ఎలా ఉన్నారో తెలీదు, ఎక్కడున్నారో కబురు లేదు. నాలుగు దాటేసింది, స్కూల్ మూసేసి ఉంటారు ఈపాటికి. ఎక్కడున్నారో? ' ఏమిటో అని పెద్దలందరికీ ఆందోళనగా ఉంది. బయటకి కాలు పెట్టేలా లేదు. ' పొద్దున్న తెరిపి ఇచ్చినట్టే ఇచ్చి ఇంతలో పట్టుకుంది ఈ మాయదారి వాన ' అని పెద్దలు తిట్టుకుంటున్నారు.

అమలాపురంలో బాంక్ కి వెళ్ళిన విస్సన్నగారి అబ్బాయి, పనిమీద వెళ్ళిన సూర్యం గారి చిన్న కొడుకు చిట్టి, ఎవరూ రాలేదు. పెద్దవాళ్ళగురించి భయం లేదు కానీ పిల్లలు ఎలా ఉన్నారో, ఎలా వస్తారో అని భయం. వాన చూస్తే కొట్టి కురుస్తోంది. నాలుగు గంటలు

ఎడతెరిపి లేకుండా కురిసి, సాయంత్రం ఆరుగంటలవేళ తెరిపి ఇవ్వడం మొదలుపెట్టింది. పూర్తిగా ఆగేసరికి ఏడయింది. కొద్దిగా నీరు తగ్గిన తరవాత ఊరి పెద్దలు పంచాయితీ ఆఫీస్ వద్దకు వచ్చి ఏమి చెయ్యడమా? అని ఆలోచించసాగారు. బండి వెళ్ళేట్టులేదు. ఈ రాత్రికి కొంత ప్రవాహం తగ్గితే రేపు పొద్దున్నే వంతెన మీద కొద్దిగా ఇసక, కంకర అవీ వేసి రిపేర్ చేసాక వెళ్ళి పిల్లలని తీసుకుని రావడమే మంచిది అని అనుకున్నారు, అనుకోవడానికి అంతకంటే మరో మార్గమేముంది గనక?.. పిల్లల తల్లులు బెంగతో తల్లడిల్లి పోతున్నారు, తండ్రులు గుంభనంగా దిగులు మనసులో దాచుకున్నారు. ఒకరిద్దరు లాంతర్లూ, కర్రలూ పట్టుకుని వెళదామన్నారు, కానీ మిగతావారు ఆపారు, ' రాత్రి మోకాలిలోతు నీళ్ళల్లో పురుగే ఉందో , గొయ్యే ఉందో, ఏమీ తెలియదు కదా, పైగా స్కూల్ హెడ్మాస్టర్ మన పిల్లల్ని ఎరిగినవారేకదా, ఏదో ఒకటి చేస్తారు ' అని ధైర్యం చెప్పారు మిగతావారు. రాత్రంతా వాన రాలేదు అదృష్టవశాత్తు.

మర్నాడు తెల్లవారుతూనే పిల్లల్ని వెంటబెట్టుకుని వచ్చారు. విస్సన్న గారి అబ్బాయి, సూర్యం గారి చిట్టి. రాత్రంతా విస్సన్నగారి అరుగులమీద జాగారం చేసిన పిల్లల తల్లితండ్రులు అప్పుడు కుదుట పడ్డారు. పిల్లలు స్కూల్ కి వెళ్ళినట్టు తెలుసు గనక సాయంత్రం బాంక్ నించే స్కూలికి వెళ్ళి పిల్లలని తన స్నేహితుడింటికి తీసుకుని వెళ్ళి, అక్కడనించీ రిక్షాలో వంతెన దాకాను, అక్కడనించీ చిన్నవాళ్ళని ఎత్తుకుని, పెద్దవాళ్ళని నడిపించుకుని తీసుకొచ్చారు వారిద్దరూ. తడవకి ఒకరిని, అందరూ కలిసి నడిస్తే వంతెనమీద ప్రమాదమని.

'చదువు లేకపోయినా పరవాలేదు, మేము పిల్లలని ఇంక అమలాపురం పంపనే పంపం' అని తల్లులు అప్పుడే చెప్పేసారు. వాన వెలిసి ఆకాశం నిర్మలమయింది మూడో రోజున. కానీ విస్సన్న గారి మనసులో ఆలోచనా మేఘాలు మాత్రం విడలేదు.

'సరైన రోడ్లు లేక, సౌకర్యాలు లేక ఇలాంటి స్థితిలో ఉన్న పల్లెటూర్లకి మోక్షం ఎప్పుడొస్తుంది? రోజు వారీ జీవితమే ఇంత కష్టంగా ఉంటే ఇంక చదువులూ, ఉద్యోగాలు ఎలా వస్తాయి? తమ ఊరికంటే వెనకగా ఉన్నవి మరీ శుద్ధ పల్లెటూర్లు, అవి ఎప్పటికైనా వెలుగు చూస్తాయా?

వంతెన ఎలాగోలా బాగు చేయించవచ్చు, మహా అయితే ఓ ఆరునెల్లు పట్టచ్చు, అధికారుల చుట్టూ తిరగడానికి. కానీ పిల్లల సంగతేమిటి? పిల్లల్ని ఎలా ఇంత కష్టపెట్టడం? ఏ రోజు ఎలా ఉంటుందో తెలియక, అంత దూరాలు పంపి వాళ్ళ కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని కూర్చునే తల్లితండ్రులు.. ఓ కబురూ, కాకరకాయ తెలియకుంటే కలిగే ఆవేదనా.. ఇవన్నీ ఇంకా ఎంతకాలం?' మనసంతా ఆక్రోశంతో నిండిపోయింది ఆయనకి.

ఈ సమస్యకి ఒకటే సమాధానం. ఊరిలోనే అన్ని సదుపాయాలు ఉండాలి ఒక హాస్పటల్, స్కూల్

ఇలా.. అనుకున్నాక ఆయన మనస్సు కొంత శాంతించింది. మిగతావారితో కలిసి ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఆయనకీ, పిల్లలకీ ఉన్న శ్రద్ధ వల్లనూ, పిల్లలందరూ తెలివైన వాళ్ళు కావడంతోనూ చదువులు బాగా అబ్బి అందరూ మంచి ఉద్యోగాలలోనే స్థిరపడ్డారు.. హైదరాబాదులోనూ, మద్రాస్ లోనూ ఉంటున్న పిల్లలు 'సరదాగా మా వూరి కి రండి నాన్నా! ' అని పిలిస్తే కూడా ఏదైనా విశేషముంటే వెళ్ళి ఓ నాలుగురోజులు ఉండి వచ్చేయ్యడం తప్ప ఎప్పుడూ ఆయన పెద్దగా ఎక్కడకీ వెళ్ళింది లేదు. తన ఇల్లూ, దానికంటే ఎక్కువగా తన ఊరు ఇదే ఆయన ప్రపంచం.

నాలుగు ఊళ్ళూ చూడడం అవీ ఇష్టమైన మంగళాంబ గారే అప్పుడప్పుడూ వెళ్ళి కూతుళ్ళదగ్గర, కొడుకుల దగ్గర ఉండి వస్తుండేవారు. 'ఏవిటో ఆవిడకున్నంత సరదా నాకు లేదమ్మా, మన గాలి, మన వూరు ఈ తర్వాతే ఏదైనా' అనేవారు.

అలాంటి విస్సన్నగారు ఎంత మెత్తగా బతికారో, అంత సుతిమెత్తగానూ వెళ్ళిపోయారు ఒక రాత్రి. ఎవరికీ ఏ కష్టమూ లేకుండా, ఒక పిల్ల తెమ్మెర నిశ్శబ్దంగా వీచి తెరమరుగైనట్టుగా. ఒక నీలి మేఘం సంతృప్తి ఆవిరిని, పరోపకారాల నిండుతనాన్నీ నింపుకుని, మంచితనపు జల్లులు కురిపించి తన పని ముగియటంతోనే మాయమైనట్టుగా. 'మనిషై పుట్టినందుకు నలుగురికేదైనా మంచి

చెయ్యగలిగితే చాలు, మణిమాణిక్యాలు మనతో వస్తాయిటమ్మా? మన వూరి పిల్లలగురించే నా బాధంతా! పోయేరోజు ముందు కొడుకుతో అన్న మాటలివి. ఆ రోజు ఊరిలో కంటతడి పెట్టని వారు లేరు.

ఇది జరిగి దాదాపు ముప్పయ్ ఏళ్ళకు పైగా అయింది. విస్సన్న గారి పిల్లలూ, మనవలూ అందరూ పెద్దవాళ్ళయి దేశంలోనూ, ప్రపంచపు నలుమూలల్లోనూ స్థిరపడ్డారు. ఒక్కరూ ఉండలేరని మంగళాంబగారిని కొడుకులు తీసుకుపోయారు. ఆయన తలపులని తనలో దాచుకున్నట్టుగా పెద్ద పెద్ద టేకు తలుపులున్న ఇల్లు మాత్రం మిగిలి ఉంది చాలా రోజులు.

విస్సన్న గారి ఆబ్దీకం నాడు ప్రస్తుత కరణంగారి దగ్గరనించి నించి వారి అబ్బాయిలకి ఫోన్ వచ్చింది.

'మొన్న కురిసిన పెద్ద వర్షానికి మీ ఇంటి కప్పు కూలిపోయింది ఒక పక్కన. మీరొచ్చి ఒకసారి చూసుకుంటే, తర్వాత ఏదైనా బాగులు చేయించమంటే చేయిస్తాము' అని.

తెలిసిన వారిని ఊరికేనే ఉండమనడమూ, పెద్దగా అద్దె ఇచ్చుకోలేని వారిని కొబ్బరికాయలో అవీ దాచుకోమనో ఇలాంటివెన్నో అమలు పరిచినా, అవేమీ పెద్దగా నడవలేదు. తాము పుట్టి పెరిగిన ఇల్లు ఖాళీగా ఉండడం వల్ల పాడయిపోతోందనే బాధ పడేవారు ఇన్నాళ్ళు. ఇప్పుడు ఇల్లు ఒక పక్కన కూలిపోయిందనేసరికి వాళ్ళకి అది రెట్టింపైంది.. అన్నగారింటికి వచ్చిన ఆడపిల్లలు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు ఆ మాట విని. మంగళాంబగారైతే 'ఒకసారి వెళ్ళి చూసొద్దామే, మళ్ళీ నేను వెళ్ళగలనో లేదో' అన్నారు కోడలితో..

వదిలేస్తే శిధిలమైపోతున్న ఇల్లు. తమ బాల్యానికి మిగిలిన గుర్తు, నాన్నగారి జ్ఞాపకం. వెళ్ళి ఉండాలంటే బదిలీల ఉద్యోగాలు, పిల్లల చదువులు.

'పిల్లల చదువులు' అనగానే అసంకల్పితంగానే వారి మనసుల్లో తళుక్కున మెదిలింది పిల్లల కోసం తమ తండ్రి తాపత్రయం. 'కాకతాళీయంగానైనా సరే తమ తండ్రి ఆబ్దీకం నాడే వచ్చిన ఫోన్, ఊరికోసమే ఆలోచించిన నాన్నగారి గుర్తుగా ఊరికే ఏదైనా కానుక ఇస్తే? ' అన్న ఊహ వారిని ఆలోచింపచేసింది. ఇన్నాళ్ళూ తమ ఉద్యోగాలు, సంసార తాపత్రయాలలో పడి ఇంటి గురించి పెద్దగా అలోచించలేదు వాళ్ళు. ఇప్పటికైనా కనీసం ఏదో ఒకటి చెయ్యాలి అనుకున్నారు. అదే ఆయన పేరు మీద ఒక స్కూల్ ఏర్పాటుకు నాందిగా తమ స్థలాన్ని ఇవ్వాలని, అది మొదలు స్కూల్ ఏర్పడే వరకూ కృషి చెయ్యాలని. అనుకోగానే తమ్ముళ్ళు ముగ్గురికీ ఫోన్లు చేసి మాట్లాడారు. అన్నలకి తమ్ముళ్ళేగా, వెంటనే అవునన్నారు. అమ్మాయిలతే వాళ్ళ నాన్నగారే మళ్ళీ వస్తున్నంతగా సంతోషించారు. కోడళ్ళూ, మనవలూ, మనవరాళ్ళూ, అల్లుళ్ళూ వెంటనే చేసేద్దాం అన్నారు. మంగళాంబ గారు భర్త కోరిక ఇన్ని రోజులకైనా తీరుతున్నందుకు సంతృప్తి పడ్డారు.

అలా ఈనాడు మొదలవబోతున్న స్కూల్కి మొదటి బీజం పడింది. తరవాత మిగిలిన పాత ఇల్లు కూలగొట్టినప్పుడు కాస్తంత బాధతోపాటు ఆనందం కూడ అనుభవించారు వాళ్ళు. అన్ని పనులు పూర్తి అయ్యి ప్రారంభోత్సవానికొచ్చేసరికి దాదాపు సంవత్సరం పట్టింది.

---------------

ఆలోచనల్లోనూ, జ్ఞాపకాలలోనూ పడి ఎంతసేపు నూతిదగ్గర ఉన్నారో కూడా తెలియలేదు అతనికి.

సాయంత్రం చల్లబడ్డాకా స్కూల్ చూడటానికి వెళ్ళారు ఆయన. కొత్తగా కట్టిన చిన్న భవనం తళతళలాడుతోంది, పండగకి కొత్త పంచ కట్టుకుని చెప్పలేని వింత తేజస్సుతో మెరుస్తున్న నాన్నలాగ. తడి ఆరని కాంక్రీటు, నాన్న మనసులా చల్లగా ఉంది. కిటికీలలోంచి వీస్తున్న చల్లని గాలి నాన్న మాటలా మృదువుగా తాకుతోంది. తలుపులు సరిగా పడుతున్నాయో లేదోనని చూడటానికి ఒక తరగతి గది తలుపు వేస్తే వెచ్చగా నాన్న పక్కలో పడుకున్నట్టుగా ఉంది. రేపటినించీ మాస్టార్లు రాయబోయే నల్లబల్లలు చూస్తే ఊరందరికీ అన్ని విషయాలలోనూ తలలో నాలికలా ఉంటూ నాన్న ఇచ్చే సలహాలూ, చెప్పిన మంచి మాటలూ మెదులుతున్నాయి. ఏమూల చూసినా ఏదో

ఒక నాన్న జ్ఞాపకం ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. పేరుకు మాత్రమే కాదు ఇది నిజంగా నాన్న కొలువున్న స్కూల్. ఉద్వేగంగా అనుకున్నారు ఆయన.

ఇదివరకు నాన్న తన ఇంట్లో వెలిగించిన విద్యాదీపాలు రేపటినించీ నాన్నలోనే వెలుగుతాయి. ఎందుకంటే నాన్న వేరు, స్కూల్ వేరు కాదుగా. హృదయం నిండీ కళ్ళల్లోకి జారిన కన్నీటి చుక్క సాక్షిగా అనిపించిన ఆ మాటని అందరికి చెప్పడానికి కరణంగారింటికి పరుగుతీసారయన.. అచ్చం స్కూల్ పిల్లాడిలాగే.

ఇదే వారి నాన్న పేరున వెలిగిన అక్షర దీపం.

***

